# నమస్తే తెలంగాణ
## జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 16 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




జూరాల ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటి నిల్వ

## జూరాలకు భారీ వరద

- 9,259 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,504 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు

గద్వాల, జూన్ 15 : ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్ట్‌కు వరద పెరుగుతున్నది. శనివారం 9,259 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,504 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 406, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.894 టీఎంసీల నిల్వ ఉన్నది.

***ఆర్డీఎస్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో***

అయిజ, జూన్ 15 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. 9,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 9,310 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నదని ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్ట నీటి మట్టం 9 అడుగులకు చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

***టీబీ డ్యాంకు..***

టీబీ డ్యాంకు 1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 301 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 100.855 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.024 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# కొత్త కలెక్టర్లు వచ్చారోచ్..

- పాలమూరు, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట కలెక్టర్లు బదిలీ
- కొత్తగారానున్న విజయేంద్ర, సంతోష్, ఆదర్శసురభి, సిక్తా పట్నాయక్







కలెక్టర్లు విజయేంద్ర బోయి, సంతోష్, ఆదర్శసురభి



కలెక్టర్ సిక్తా పట్నాయక్

మహబూబ్‌నగర్ అర్బన్/నాగర్‌కర్నూల్/వనపర్తి/ నారాయణపేట, జూన్ 15 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి నాయక్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్త ర్వులు జారీ చేసింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయేంద్ర బోయి సోమవా రం మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

- ⇨ నాగర్‌కర్నూల్ నూతన కలెక్టర్‌గా 2016 బ్యాచ్‌కు చెందిన బడావత్ సంతోష్ రానున్నారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన ఉదయ్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంచిర్యాల కలెక్టర్‌గా ఉన్న బడావత్ సంతోష్ రానున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్‌గా ఉన్న కుమార్‌దీపక్ పదోన్నతిపై మంచిర్యాల కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.
- ⇨ వనపర్తి కలెక్టర్‌గా ఆదర్శ సురభి నియమితులయ్యారు. ఆదర్శ సురభి 2018 ఐఏఎస్ బ్యాచ్ కాగా ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ తొలిసారిగా వనపర్తి కలెక్టర్‌గా నియమితులయ్యారు. తేజస్‌నందలాల్ పవార్ 2023 ఫిబ్రవరి 1న వనపర్తి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేశారు.
- ⇨ నారాయణపేట కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ నియమితులయ్యారు. 20 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నారాయణపేట కలెక్టర్‌గా పనిచేస్తున్న కోయ శ్రీహర్ష పెద్దపల్లి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సిక్తా పట్నాయక్ 1987లో జన్మించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆమె హనుమకొండ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. కాగా రెండ్రోజుల్లో ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.


# చేప చెరువులోకొచ్చేనా..?

- కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో నీలివిప్లవం
- చేతి, కులవృత్తులకు ప్రోత్సాహం
- షురూకాని టెండర్ల ప్రక్రియ
- వానకాలం వచ్చి చెరువుల్లోకి నీరు చేరుతున్నా కానరాని ప్రణాళిక
- అయోమయంలో మత్స్యకారులు
- వృత్తిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వ చేయూత కరువు



చేపా చేపా ఎప్పుడొస్తావ్ అంటే.. ఏమో వానలు కురిసినప్పుడంటే.. ఇప్పుడు వానలు కురుస్తూనే ఉన్నాయ్ కదా.. మరెప్పుడొస్తావంటే.. వస్తా.. వస్తా అన్నట్లుగా తయారైంది.. వంద శాతం చేప పిల్లల పంపిణీ పథకం. కులవృత్తులను కాపాడటం, ఆ వృత్తిదారులకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలకు కాంగ్రెస్ సర్కారు మంగళం పాడింది. ఈ క్రమంలో మత్స్యకారుల కోసం అమలైన చేప పిల్లల పథకం అమలవుతుందా..? లేదా అన్న అయోమయం మత్స్యకారుల్లో నెలకొన్నది. చేపల పెంపకంతో నీలివిప్లవం సృష్టించాలని భావించిన పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

*– నాగర్‌కర్నూల్, జూన్ 15 (నమస్తే తెలంగాణ)*



**గతేడాది 2 కోట్లకుపైగా..**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రతి సంవత్సరం శ్రీశైలం రిజర్వాయర్‌తో పాటుగా ఐదు రిజర్వాయర్లు, 13 వందల చెరువుల్లో 2 కోట్లకుపైగా చేప పిల్లలను విడుదల చేశారు. చేపలతో ఉపాధి పొందే మత్స్యకారులు ఈ పథకంపై ప్రభుత్వ విధాన నిర్ణయం కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ పథకాన్ని కొనసాగించాలని కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమను అన్ని విధాలా ఆదుకున్నదని చెప్పుకొచ్చారు.

**చేప పిల్లల పథకంపై నీలినీడలు**

**ఇంకా ఆదేశాలు రాలేదు**



చేప పిల్లల టెండర్ల ప్రక్రియ గురించి ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో దాదాపు 2 వేల చెరువులు ఉన్నాయి. గతంలో చేప పిల్లల పంపిణీకి సంబంధించి కార్యాచరణను ప్రభుత్వానికి నివేదించాం. సర్కారు నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. అప్పుడే చేప పిల్లల పంపిణీ ఉంటుంది.

**- రహ్మాన్, జిల్లా మత్స్యశాఖాధికారి, నాగర్‌కర్నూల్**

### గతంలో జూన్ నుంచే సబ్సిడీపై..

వందశాతం సబ్సిడీతో చేప పిల్లలను కేసీఆర్ ప్రభుత్వం పంపిణీ చేసి మత్స్యకారులకు ఆర్థికంగా చేయూతనిచ్చింది. ఈ పథకం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ప్రభుత్వమే వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను అందజేసింది. చేపల పెంపకంలో తెలంగాణ నీలి విప్లవాన్ని సృష్టించింది. మిషన్ కాకతీయ పథకంతో చెరువులను పునరుద్ధరించడం, ఎంజీకేఎల్ఐ సహా పలు ప్రాజెక్టులను ప్రారంభించడంతో నీటి వనరుల లభ్యత పెరిగింది. చేప పిల్లలను ఉచితంగా అందజేయడంతో చేపల లభ్యత పెరిగి మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి పొందారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల చెరువులు, కుంటలు, జలాశయాల్లో నాటి మంత్రులు, ఉన్నతాధికారులు సహా ప్రజాప్రతినిధులంతా చేప పిల్లలను విడుదల చేశారు. ఇదంతా ప్రతి ఏడాది పండుగ వాతావరణంలో జరిగేది. దీనివల్ల వర్షాకాలంలోనో, అప్పుడెప్పుడో దొరికే చేపలు నేడు నాగర్‌కర్నూల్‌లాంటి ప్రాంతాల్లో రోజూ దొరుకుతున్నాయి. ఇది స్థానికంగా మత్స్యకారులు, హోటళ్ల నిర్వాహకులకు లాభం కల్పించడంతో పాటుగా చేపాహార ప్రియులకూ సంతోషాన్ని ఇస్తోంది. అలాంటి ఈ పథకం అమలు ఇప్పుడు సందేహంగా మారింది. అలాంటి ఈ పథకం అమలుపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. వర్షాలు పడుతున్నా ఇంకా పంపిణీపై క్లారిటీ రాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

**స్పందించని ప్రభుత్వం**

చేపలు పెరగాలంటే జూన్‌లో చేప పిల్లల టెండర్ల ప్రక్రియను ప్రారంభించాల్సి ఉన్నది. కానీ ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. దీనిపై మత్స్యశాఖ అధికారులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారు. ఓ చేప పిల్ల కిలో సైజు పెరగాలంటే నెలల సమయం పడుతుంది. జూలై, ఆగస్టు నెలల్లో చేప పిల్లలు వదిలితే డిసెంబర్ లేదా జనవరిలో పట్టుకొని విక్రయించుకునేందుకు వీలుగా ఉంటుంది. చేప పిల్లలు ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. సెప్టెంబర్‌లో చేప పిల్లలు వదిలితే అవి ఎదగడానికి ఫిబ్రవరి వరకు సమయం పడుతుంది. ఇంకా పెరగాలంటే ఏప్రిల్, మే నెలలో వస్తాయి. ఈ నెలల్లో అధిక ఎండలతో చెరువుల్లో నీరు ఇంకి చేపలు చనిపోయే అవకాశం ఉంటుంది. మత్స్యకారులు పూర్తి నీటితో ఉండే చెరువుల్లో 45రోజుల వయస్సుతో ఉన్న 35-40 మిల్లీ మీటర్ పొడవున్న చేపలను పెంచుతారు. అలాగే ఏడాది మొత్తం నీళ్లుండే ప్రాజెక్టులు, పెద్ద చెరువుల్లో 75 రోజుల వయస్సున్న 80 నుంచి 100 మిల్లీ మీటర్ల పొడవున్న చేపలను పెంచుతారు.



సిబ్బందిని సన్మానిస్తున్న మల్టీ జోన్-2 ఐజీ సుధీర్‌బాబు, చిత్రంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

# లైంగికదాడి కేసులో జీవిత ఖైదు

- వివరాలు వెల్లడించిన మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు

మహబూబ్‌నగర్, జూన్ 15 : దళిత బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు అభినందించి సన్మానించారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా డీఐజీ కార్యాలయానికి ఐజీ రాగా ఉమ్మడి జిల్లా డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌తో పాటు ఎస్పీ, జిల్లా పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ నేరాలపై నిరంతరం నిఘా పెంచాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బోయపల్లి వద్ద జరిగిన దళిత బాలికపై లైంగిక వేధింపుల కేసు విషయమై ఆరా తీశారు. నిందితుడు గోదా మల్లేశ్ నడుపుతున్న క్లినిక్‌కు కడుపునొప్పితో వచ్చిన బాలికపై 2016 ఫిబ్రవరి 4న లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అప్పటి ఎస్సై జి.రాజేశ్వర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ కృష్ణమూర్తి విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. అనంతరం నేరపరిశోధన చేసి అభియోగపత్రాలను సమర్పించి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాద, ప్రతివాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక చట్టం ద్వారా యావజ్జీవ శిక్షతోపాటు రూ.8వేల జరిమానా, లైంగికదాడి కేసులో మరో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వి.శారదా దేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసులో విచారణ జరిపిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు రాంబాక్ష, అప్పటి డీఎస్పీ కృష్ణమూర్తి, ప్రస్తుత డీఎస్పీ వెంకటేశ్వర్లు, పీసీ నెంబర్ 141 అశోక్‌రెడ్డి, రూరల్ పీఎస్ హోంగార్డు 154 సురేశ్‌కుమార్‌ను ఐజీ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి..




విద్యను ప్రైవేటు పాఠశాలలు వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాలు, ఫీజుల పేరుతో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నాయి. అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా.. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు ఇలా విద్యార్థులకు అవసరమైన వాటిని విక్రయిస్తూ రూ.వేలకు వేలు సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు స్కూళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులను వెంటనే రద్దు చేయాలి. అవసరమైతే సదరు పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలు మరీ బరితెగించాయి.

**- దారమోని గణేశ్, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు, కల్వకుర్తి**



- కార్పొరేట్ విద్యాసంస్థల నిలువు దోపిడీ
- ఫీజు చెల్లింపుల్లో డిస్కౌంట్ ఆఫర్లు
- పాఠశాలలకు సమీపంలోనే అద్దెకు గదులు
- యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న సిబ్బంది
- ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోని యాజమాన్యం
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థి సంఘాలు



# చదువు కొనాల్సిందేనా?



కల్వకుర్తిలో పాఠశాల పక్కనే ఓ ఇంట్లో పుస్తకాల విక్రయాలు

కల్వకుర్తి, జూన్ 15 : శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్న తీరుగా కార్పొరేట్ పాఠశాలలు పనిచేస్తున్నాయి. పుస్తకాలు, స్కూల్ బ్యాగులు ఇలా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ప్రైవేట్ స్కూల్స్‌లో విక్రయించరాదని ప్రభుత్వం హుకూం జారీ చేసింది. అయితే అందుకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కొత్త ప్రణాళికలు రచిస్తున్నాయి. పాఠశాలల పక్కనే ఒక ఇంటిని అద్దెకు తీసుకొని అందులోనే పుస్తకాలు, నోట్‌బుక్స్ ఇలా విద్యార్థులకు కావాల్సిన సామగ్రిని విక్రయిస్తున్నారు. ఇదే విషయమై ఎంఈవోను ప్రశ్నిస్తే పాఠశాలలో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని.. పాఠశాల వెలుపల విక్రయిస్తే ఏమీ చేయలేమని బదులిచ్చారు.

***కార్పొరేట్ మాయాజాలం..***

కల్వకుర్తి పట్టణంలో నాగర్‌కర్నూల్‌కు వెళ్లే దారిలో ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం కొత్త పద్ధతులతో విద్యార్థుల తల్లిదండ్రులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నది. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు, టై, బెల్ట్ వంటివి కొనుగోలు చేయాలని నిబంధన విధించగా.. ఇది ఏ కాగితాల్లోనూ కనిపించదు.. కేవలం నోటి మాటల ద్వారానే ఈ తతంగం జరుగుతున్నది. ప్రభుత్వం పాఠశాలల్లో బుక్స్, టై, బెల్ట్‌లు విక్రయించొద్దని ఆదేశించడంతో సదరు స్కూల్ యజమాన్యం పాఠశాల పక్కనే ఒక ఇంటిని అద్దెకు తీసుకుని సిబ్బందిని నియమించి పుస్తకాల వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నిర్వహిస్తున్నది.

***సెకండ్ క్లాస్ పుస్తకాల ధర రూ.6,139***

పుస్తకాల ధరలను చూస్తే మాత్రం కండ్లు బైర్లు కమ్మాల్సిందే..! రెండో తరగతి పుస్తకాల ధర.రూ.6,139, నాలుగో తరగతికి రూ.8,061. మా స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ నుంచే శాస్త్ర, సాంకేతికవిద్యలు నేర్పుతాం కాబట్టి.. అందుకు అవసరమైన పుస్తకాలు ఉంటాయి. అందుకే ధరలు ఎక్కువగా ఉంటాయని పాఠశాల యజమాన్యం చెబుతున్నది. రెండో తరగతి పుస్తకాల ధర రూ.800 నుంచి గరిష్ఠంగా రూ.1,200 వరకు మాత్రమే ఉంటుంది కానీ.. వసూలు చేసేది మాత్రం రూ.6వేలకు పైగానే. ఇలా కేవలం పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలతో పాఠశాలకు రూ.లక్షల్లో లాభం వస్తుందనేది జగమెరిగిన సత్యం. విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని స్కూల్ యాజమాన్యాలు దందా చేస్తున్నాయని విద్యాభిమానులు మండిపడుతున్నారు.

### ఒకేసారి చెల్లిస్తే 20 శాతం డిస్కౌంట్..

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల డిస్కౌంట్ ఆఫర్ కూడా నడుస్తున్నది. ఫీజు మొత్తం ఒకేసారి చెల్లిస్తే 20 శాతం రాయితీ.. మూడు విడుతల్లో చెల్లిస్తే 15 శాతం డిస్కౌంట్ ఇస్తామని లెక్కలేసి మరీ చెబుతున్నారు. ఉదాహరణకు రెండో తరగతి ఫీజు రూ.32వేలు అనుకుంటే.. మూడు విడుతల్లో చెల్లిస్తే 15 శాతం రాయితీ అంటే రూ.4,800 డిస్కౌంట్ పోనూ రూ.27.200 చెల్లించొచ్చు. మొత్తం ఒకేసారి చెల్లిస్తే 20 శాతం అంటే రూ.6,400 డిస్కౌంట్ పోనూ రూ.25,600 చెల్లించొచ్చు.. అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు.



మాట్లాడుతున్న నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

# చిన్నపొర్ల ఘటనలో ఐదుగురి అరెస్ట్

ఊట్కూర్, జూన్ 15 : భూ తగాదాల నేపథ్యంలో దాయాదుల చేతిలో గువ్వలి సంజీవ్ (28) దారుణ హత్యకు గురైన ఘటనకు సంబంధించి ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. ఈమేరకు ఆయన ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సమావేశమై వివరాలను వెల్లడించారు. ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన గువ్వలి లక్ష్మప్పకు ఇద్దరు భార్యలు.. మొదటి భార్య సవారమ్మకు ఎర్రగండ్ల సంజప్ప, రెండో భార్య తిప్పమ్మకు పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప సంతానం ఉన్నట్లు తెలిపారు. తండ్రి వారసత్వపు ఆస్తిని ఇద్దరు భార్యలకు బదులు ముగ్గురు కొడుకులకు సమానంగా పంచడాన్ని సంజప్ప కుమారులు వ్యతిరేకిస్తున్నారు. మొత్తం తొమ్మిదెకరాలను ముగ్గురికి సమానంగా పంచడంతో సర్వే నెంబర్ 112 సంబంధించిన రెండెకరాల పొలం విషయంలో ఎర్రగండ్ల సంజప్ప కుమారులు రెండేళ్ల కిందటే కోర్టును ఆశ్రయించారన్నారు. మూడేళ్లుగా ఆస్తి కోసం వివాదం నడుస్తుండగా పోలీసులు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం పెట్టారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైందన్నారు. కాగా ఈనెల 13న పెద్ద సవారప్ప, అతని కుమారుడు సంజీవ్, తమ్ముడు చిన్న సవారప్ప, మరదలు కవిత తమ పేర్లపై ఉన్న రెండెకరాల వివాదాస్పద భూమిలో విత్తనాలు వేసేందుకు ట్రాక్టర్‌తో దున్నుతుండగా దాయాదులు గువ్వలి కిష్టప్పతోపాటు మరి కొందరు అడ్డుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే పొలాన్ని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడినట్లు వివరించారు. దాయాదుల దాడిలో తీవ్రంగా గాయపడిన గువ్వలి సంజీవ్‌ను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కాగా పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప, కవితకు రక్తస్రావమైనట్లు పేర్కొన్నారు. మృతుడి చిన్నమ్మ కవిత ఫిర్యాదు మేరకు మొత్తం ఏడుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న చిన్న వెంకటప్పకు గాయాలవడంతో చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించామన్నారు. ఏ3గా ఉన్న ఆటో సంజీవ్ పరారీలో ఉండగా అతడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఐదుగురు నిందితులైన గువ్వలి సంజీవ్ అలియాస్ (గుట్టప్ప), గువ్వలి నట్టల్ వెంకటప్ప, గుడ్డి ఆశప్ప, గువ్వలి శ్రీను, గువ్వలి కిష్టప్పను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందినప్పటికీ సకాలంలో స్పందించకపోవడంతో ఎస్సై శ్రీనివాసులును సస్పెండ్ చేశామన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పోలీసుల నిర్లక్ష్యం ఉందని తేలితే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల దృష్ట్యా చిన్నపొర్లలో పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తామన్నారు. సమావేశంలో సీఐలు చంద్రశేఖర్, రామ్‌లాల్, మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి, పీఆర్వో వెంకట్, పోలీసులు పాల్గొన్నారు.